క్లుప్తంగా

వైభవంగా జాతర



బాలత్రిపుర సుందరి దేవిని దర్శించుకుంటున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో వెలసిన బాలత్రిపుర సుందరి దేవి జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజ లు చేశారు. ఆదివారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పీఠాధిపతి సోమశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భజన బృందాలచే పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రంగయ్య, గోపాల్, శ్రీను, నరసింహులు, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం



పెసరవాయిలో దగ్ధమవుతున్న వరిగడ్డిని అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని పెసర వాయి గ్రామంలో ట్రాక్టర్ వరిగడ్డి లోడుతో వస్తుండగా చర్చి సమీపంలో విద్యుత్ వైర్లకు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడున్న వారు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. చాకచక్యంగా వ్యవహరించిన ట్రాక్టర్ డ్రైవర్ వెంటనే వరిగడ్డిని అన్‌లోడ్ చేశాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన పెసల జమ్ములుకు చెందిన వరిగడ్డిగా తెలిసింది. ఇదిలాఉండగా గ్రామంలో ప్రధాన రహదారిపై కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గురుకుల ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ

సి.బెళగల్: గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు భార్గవ రాయల్ స్కూల్ కరస్పాండెంట్ వెంకటస్వామి తెలిపారు. గత నెల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రవేశాలకు పరీక్షలు జరిగాయని చెప్పారు. ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి ప్రజ్వల్ అశ్విత్ 50 మార్కులకు గాను 47 మార్కులతో సత్తాచాటాడని తెలిపారు. ఆదివారం విద్యార్థిని, తల్లిదండ్రులను అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఆయన వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు సమర్పించిన దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు సూచించారు. అలాగే అర్జీదారులు meekosam. ap. gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నేడు నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు https://meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమ్మెకు సహకరించండి

కర్నూలు(సెంట్రల్): మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సహకరించాలని కోరుతూ నవత ట్రాన్స్‌పోర్టు మేనేజర్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఆదివారం వారు మేనేజర్‌ను కలిసి హమాలీలు సమ్మెలో పాల్గొనేందుకు అనుమతించాలన్నారు. కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెకు అన్ని వర్గాల నుంచి మద్దతు కోరుతున్నట్లు చెప్పారు.

దాడులతో డైవర్షన్ పాలిటిక్స్

- కూటమి ప్రభుత్వం అరాచక పాలన
- మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసుల దురుసు ప్రవర్తన దారుణం
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు
- కొందరు పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

కల్లూరు: పాలనలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నేతలపై దాడులు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి విడుదల రజిని పట్ల పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, సీఎం చంద్రబాబు ప్రతిపక్ష పార్టీలను ఎలా కట్టడి చేయాలి, ఎలా కక్ష తీర్చుకోవాలనే విషయాలపై దృష్టి పెట్టారన్నారు. కొందరు అధికారులు, పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారన్నారు. పల్నాడు జిల్లాలోని మానుకొండ వారి పాలెంలో ఓ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడటం సరికాదన్నారు. తన అనుచరుడు శ్రీకాంత్‌ను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని ప్రశ్నించిన విడుదల రజిని పట్ల చిలకలూరుపేట రూరల్ సీఐ సుబ్బారాయుడు అనుచితంగా ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. మహిళల పట్ల కొందరు పోలీసులు అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. అలాగే ఈ నెల 9న కంతేరు గ్రామ వైఎస్సార్ సీపీకి చెందిన కల్పన అనే దళిత మహిళను తెల్లవారు జామున 3 గంటల సమయంలో 20 మంది పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేశారన్నారు.దుస్తులు మార్చుకుని వస్తానని ఆమె కోరినా పోలీసులు వినిపించుకోలేదని, అయితే ఉదయం 6.30 గంటలకు అరెస్టు చేశామని కోర్టును సైతం తప్పుదోవ పట్టించారన్నారు. నిర్బంధాలు, అణిచివేతతో వైఎస్సార్‌సీపీని అడ్డుకోవాలని చూస్తే భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు,దాడులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కనపడటం లేదా? అన్ని ప్రశ్నించారు.

సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదు..

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా రాష్ట్రంలోని ప్రజలకు ఒరిగిందేమీ లేదని కాటసాని విమర్శించారు. తల్లికి వందనం, యువతకు ఉద్యోగాలు, అన్నదాతకు పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీల అమలు ఊసే లేదన్నారు. పథకాలు అందించకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు.

ప్రశ్నించిన వారిపై కేసులు..

ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియాలో ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం ఎంత వరకు న్యాయమని కాటసాని ప్రశ్నించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు గాలికి ఎగిరిపోయాయన్నారు. చంద్రబాబు మోసం చేస్తున్న తీరును సామాజిక మాధ్యమాల ద్వారా నిలదీస్తున్న వారిని వ్యక్తిగతంగా హింసించేందుకు తెగబడ్డారన్నారు. డిప్యూటీ మేయర్ రేణుక, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జోనల్ విభాగం అధ్యక్షురాలు గాజుల శ్వేతా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల పట్ల పోలీసులు ప్రవరిస్తున్న తీరు దారుణమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అరుణ, నారాయణ రెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళ నేతలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు రూరల్: ముడుమలగుర్తి గ్రామంలో శ్రీనవరత్నాల లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం కనుల పండువగా సాగింది. అంతకు ముందు శ్రీలక్ష్మీ నరసింహ స్వామి, అమ్మవార్లకు పండితులు వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠంపజేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. గోవింద నామస్మరణల మధ్య ఉత్సవం ఘనంగా సాగింది.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు వేలం పాట

పాణ్యం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో.. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న భూములను కౌలుకు సాగు చేసుకునే హక్కుల కోసం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ సువర్ణ ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ రామస్వామి, వీరనారాయణస్వామి, పాణికేశ్వరస్వామి, పడ వెంకటాద్రిస్వామి, సత్యనారాయణస్వామి వార్లకు సంబధించిన భూములకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.2 వేలు దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. ఉదయం 10 గంటలకు వేలంపాట ప్రారంభమవుతుందన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపారు. గ్రామ శివారులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం మధ్యాహ్నం దాడులు చేశారమని తెలిపారు. ఆరుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందుతుల్లో గ్రామానికి చెందిన ముక్కెరె వెంకటేష్, బోయ వీరేష్, బోయ చిన్న సుంకన్న, మంగలి నాగరాజు, బోయ నాయుడు, పచ్చిపులుసు మన్నెంకొండలు ఉన్నట్లు వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,540 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



వైద్య శిబిరానికి హాజరైన మహిళలు

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల గ్రామంలో ।మదర్స్ డే।ను పురస్కరించుకుని కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు చెందిన మహిళా వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో మహిళా వైద్యులు మాధవి శ్యామల, విష్ణుప్రియ, సాయి వాణి, విజయలక్ష్మీ దాసరి, స్ఫూర్తి రెడ్డితో పాటు చంద్ర శేఖర్‌రెడ్డి పాల్గొని గ్రామస్తులకు ఉచితంగా వైద్యలు అందించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. శిబిరంలో గ్రామానికి చెందిన 300 మందికి పైగా మహిళలు ఉచితంగా వైద్య సేవలను పొందారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో సోమవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీలను స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన జట్లకు తొలి నాలుగు స్థానాలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల కబడ్డీ క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి జట్ల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99514 39993, 98495 29343, సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మురుగుతో అవస్థలు



ముడుమలగుర్తిలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో మురుగునీరు వెళ్లేందుకు కాల్వ లేక పోవడంతో మురుగునీరంతా ప్రధానవీధిలో నిలిచిపోయి అపరిశుభ్రంగా ఉంటోంది. నిత్యం రోడ్డుపైనే మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ఎలాగోలా కాలం వెళ్లదీసినప్పటికీ వర్షాకాలంలో కురిసే వానలకు రోడ్డుపైనే వాననీటితో పాటు, మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఆ నీటిలోనే రాకపోకలు కొనసాగించాల్సి వస్తోంది. మురుగునీరు వెళ్లేందుకు కాల్వ నిర్మించి సమస్యల పరిష్కరించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లేందుకు కాల్వను నిర్మించి సమస్యను పరిష్కరించాలని ముడుమలగుర్తి వాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు–నందివర్గం మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. కోడుమూరుకు చెందిన రూప, ఆమె భర్త హరికృష్ణ కొత్తూరు ఆలయానికి వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. హరికృష్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

వేసవి శిబిరాలు.. సృజనాత్మక వేదికలు



విద్యార్థులకు బిస్కట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: వేసవి ప్రత్యేక శిబిరాలు సృజనాత్మక వేదికలని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్ పోగ్రామ్‌ను ఆమె ఆదివారం పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం, కథలు చెప్పడం, డ్రాయింగ్, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, పెయింటింగ్ తదితర అంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా శిక్షణ పొందుతున్నారన్నారు. లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, విశ్రాంత ఉద్యోగులు గోపాలకృష్ణ, విశ్రాంత ప్రొఫెసర్ హనుమంతప్ప, ఎన్‌జీఓ నాయకులు మద్దిలేటి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రామచంద్రయ్య, శ్రీనివాసులు, సురేష్, శేషయ్య, విజయ నరసింహయ్య తదితరులు విద్యార్థులకు బిస్కెట్స్ పంపిణీ చేశారు.

ఘనంగా చర్చి ప్రతిష్టోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో బంగ్లా ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఏబీఎం చర్చి ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాలలో మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముగింపు రోజున పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, స్థానిక నాయకులు విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు విందుభోజనం ఏర్పాటు చేశారు. అతిథులకు మత గురువులు, సంఘస్తులు స్వాగత సత్కారాలు చేశారు. అనంతరం సంఘపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే గౌరు చరిత క్రీడాకారులను పరిచయం చేసుకొని, గెలుపోటములను సమానంగా భావించాలని హితవుపలికారు. స్థానిక నాయకులు ఖాజామియా, విజయుడు, బుజ్జప్ప, శంషుద్దీన్, ఉసేన్‌సర్కార్, ఏబీఎం సంఘపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యువకీర్తి ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మీసాల రఘు

కర్నూలు కల్చరల్: దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన యువ రచయిత మీసాల రఘు యువకీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులో జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో కళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా మీసాల రఘు పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాషా, సాహిత్యం, తెలుగు వైభవం, సంస్కృతి సంప్రదాయాలు, కళల పరిరక్షణ, అభివృద్ధికి సాహిత్యం, కళా రంగం ద్వారా చేస్తున్న సేవలకు గుర్తింపుగా పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండల పరిధిలోని శకునాల గ్రామంలో ఆదివారం నిర్వహించిన కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. గ్రామంలో చెన్నకేశవ స్వామి తిరునాల సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను గ్రీన్‌కో కంపెనీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీడీ ఏఎస్ నాయుడు, కేడీసీసీబీ మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 22 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి ఐదు బహుమతులకు గాను వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని, అత్యుత్తమంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బిజ్జిలి మాళీశ్వర రెడ్డి, హరినాథ్‌గౌడు, స్థానిక యువత, గ్రీన్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

మల్లెందొడ్డి స్వామి దేవర ప్రారంభం



పూజలందుకున్న స్వామివారు

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో మల్లెందొడ్డిస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. తొలి రోజు ఆదివారం సాయంత్రం గంగ పూజలో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకీలో తుంగభద్రకి తీసుకెళ్లారు. అక్కడ రాత్రి పూజల అనంతరం సోమవారం స్వామివారిని గ్రామానికి తీసుకొస్తారు. అనంతరం భక్తుల దర్శనార్థం గ్రామంలోని లింగాలయ ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి, ఒక రోజంతా ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తారు. మూడో రోజు మంగళవారం గౌరవయ్యల ప్రవేశంతో వేడుకలు తారాస్థాయికి చేరుకుంటాయి. గౌరవయ్య విన్యాసాల అనంతరం స్వామి వారిని పల్లకీలో లింగాల ఆలయం నుంచి ప్రధాన ఆలయం అయిన దేవర ఇంటికి స్వామివారిని చేర్చి, పటం ఎక్కే కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వివాహ వేడుకలో సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ పాండురంగన్న కుమారుడు తిరుమలేష్ వివాహం క్రిష్ణదొడ్డి కొండపై ఉన్న కోనా వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం జరిగింది. వివాహానికి వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, పార్టీ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు గూడూరు మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు నరసింహుడు, ముల్ల హారున్, మహానంది, వెంకటేష్, గోపాల్, సింగల్‌విండో మాజీ చైర్మన్లు సీబీ గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, ఎల్ఎల్‌సీ మాజీ చైర్మన్ చిన్న కొండన్న, వాసు, సర్పంచ్‌లు దస్తగిరి, హనుమంతు, శ్రీనివాసులు, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూలు రాఘవేంద్ర నగర్‌లోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం బుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన బుద్ధ భగవానుడి విగ్రహాన్ని టీజీ, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. మహనీయుల నుంచి స్ఫూర్తి పొందేందుకు వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ఉంటామన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

విజేత కర్నూలు జిల్లా వృషభాలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభాల బండలాగుడు పోటీల్లో జిల్లా వృషభాలు విజేతగా నిలిచి భళా అనిపించుకున్నాయి. గ్రామంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో కర్నూలు జిల్లా, బి.తాండ్రపాడు గ్రామ వాస్తవ్యులు వరలక్ష్మికి చెందిన వృషభాలు నిర్ణీత సమయంలో రాతి దూలాన్ని 4750 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.50 వేలను గెలుచుకున్నాయి. తరువాతి స్థానాల్లో నిలిచిన గద్వాల జిల్లా, ఉండవెల్లి మండలం, కంచుపాడు ఆంజనేయరెడ్డి వృషభాలు (4504 అడుగులు) రూ.40 వేలు, నంద్యాల మండలం, పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మిగనూరు మండలం, దైవందిన్నె గ్రామానికి చెందిన నందు సంయుక్త జత వృషభాలు (4500 అడుగులు) రూ.30 వేలు, గద్వాల జిల్లా, గట్టు మండలం, ఇందులాసి గ్రామానికి చెందిన వీరేష్‌గౌడు, మిడుతూరుకు చెందిన సాయివర్ధన్ సంయుక్త జత వృషభాలు (4434 అడుగులు) రూ.20 వేలు, నాగర్‌కర్నూలు జిల్లా, రాయవరం మండలం, లింగాల గ్రామానికి చెందిన అక్షరారెడ్డి వృషభాలు (4384 అడుగులు) రూ.10 వేలు, వైఎస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం, అయోధ్య నగర్‌కు చెందిన జేపీఆర్ మెమోరియల్, జేసీఎస్‌ఆర్ వృషభాలు (4357 అడుగులు) రూ.5 వేలు గెలుపొందినట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ పోటీలకు వాడాల రామనాయుడు, శేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. స్థానిక నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, స్వామిరెడ్డి, చిన్న పుల్లారెడ్డి, జగదీష్, మంగలి తిరుమలేష్, బోయ రమేష్, పాండుబాబు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికే పదవులు



వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన శ్రావణ్‌కుమార్, అనుబంధ విభాగాల కర్నూలు నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులుగా నియమితులైన కె.నరేంద్ర ఆదివారం సాయంత్రం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో పదవులు పొందిన వారందరూ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. అందరూ సమన్వయంగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

గడివేముల: వీరంతా గడివేముల జిల్లా పరిషత్ పాఠశాలలో 1996–2000 సంవత్సరం వరకు కలిసి చదువుకున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకొని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఇంతకుముందు గడివేముల పాత బస్టాండ్ నుంచి పాఠశాల వరకు పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఒక్కసారిగా కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ.. చిన్ననాటి అనుభవాలను నెమరు వేసుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.



ఒక చోట చేరిన పూర్వ విద్యార్థులు